# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ యోగా రికార్డు సాధనలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూపిన స్ఫూర్తిదాయకమైన నిబద్ధతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు.
- ❖ ప్రజలందరి సహకారంతోనే గిన్నిస్ రికార్డు సాధ్యపడిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ విద్యతో పాటు, సామాజిక స్పృహను విద్యార్థులు కలిగి ఉండాలని సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు.
- ❖ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ.. పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టనున్నామని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు.

===========================

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలనే ఉద్యమాన్ని బలోపేతం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. నిన్న విశాఖపట్నం వేదికగా జరిగిన యోగాంధ్రలో భాగంగా అంతార్జాతీయ యోగా దినోత్సవం రోజున 3 లక్షల 105 మందితో జరిగిన అతిపెద్ద యోగా సాధన తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్సును సాధించిన కార్యక్రమంలో తాను పాల్గొనడాన్ని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా ప్రస్తావించారు. విశాఖ నగరం వేదికగా జరిగిన ఈ కార్యక్రమం ఎల్లప్పుడూ అనేక మందిని మంచి ఆరోగ్యం, శ్రేయస్సు దిశగా ప్రేరేపిస్తుందన్నారు. యోగా ప్రజలను మరోసారి ఏకం చేసిందని చెబుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూపిన స్ఫూర్తిదాయకమైన నిబద్ధతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు.

===========================

ప్రజలందరి సహకారంతోనే గిన్నిస్ రికార్డు సాధ్యపడిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సామాజిక మాధ్యమం వేదికగా యోగాలో రికార్డుకు సంబంధించిన విషయాన్ని పంచుకుంది. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ... దీనిని సాకారం చేయడానికి కృషి చేసిన ప్రతీ వ్యక్తిని అభినందించారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ప్రజలు చూపిన ఉత్సుకత, నిబద్ధత స్ఫూర్తిని కలిగిస్తాయని ముఖ్యమంత్రి వివరిస్తూ…

(వాయిస్ 25 సెకన్లు)

=============================

విద్యతో పాటు, సామాజిక స్పృహను విద్యార్థులు కలిగి ఉండాలని, అప్పుడే వారు పరిపూర్ణ వ్యక్తిత్వం పొందుతారని సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రులైన విద్యార్థులకు సర్టిఫికేట్లను ఈ రోజు ఆయన ప్రధానం చేసారు. అనంతరం జస్టిస్ ఎన్.వి రమణ మాట్లాడుతూ… కళాశాలలో నేర్చుకున్న విద్య సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఉండాలని చెప్పారు. దేశంలో సంపన్నమైన పట్టణాలు, సమస్యలతో ఉన్న గ్రామాలు ఉన్నాయని వాటి మధ్య వ్యత్యాసం తగ్గాలని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా పుట్టిన ప్రాంతాన్ని, జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరువకూడదని సూచించారు. జీవితం పెట్టే పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలని ఎన్.వి రమణ సూచిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

=============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

=============================

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలకు హాజరయ్యే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి హాజరు కావాలని ఆలయ కార్యనిర్వహణధికారి కె ఎన్ వి డి వి ప్రసాదరావు తెలిపారు. ఈ రోజు దేవస్థానం ఆవరణలో ఆయన మాట్లాడుతూ… ఆలయంలో నిర్వహించే క్షీరాభిషేకం.. కళ్యాణ ఉత్సవాలు.. సూర్య నమస్కారాలు వంటి ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని కోరారు.

విరామం

=============================

మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయానికి ఈ నెల 25న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బాలాజీ, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆర్ గంగాధర్ రావు, రాజ్ భవన్ ఎడిసి రామాంజనేయులు, ఉపకులపతి కె.రామ్‌జీలతో కలిసి విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ఈ రోజు పరిశీలించారు. స్నాతకోత్సవం వేదిక, గ్రీన్ రూమ్ ల ఏర్పాటు ప్రాంతాలను పరిశీలించి చేయవలసిన ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ… ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన భోజనశాల భవనాన్ని గవర్నర్ ప్రారంభిస్తారని వీసీ ఆచార్య రామ్‌జీ తెలియజేస్తూ….

(వాయిస్ 25 సెకన్లు)

=============================

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ.. పెద్ద ఎత్తున పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టనున్నామని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న ఎస్.సి, ఎస్.టి, చిన్న, సన్న కారు రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో భాగంగా వర్షాధారిత, సాగునీటి వసతి ఉన్న వారికి పండ్లతోటల పెంపకంలో భాగంగా.. జిల్లాలో 23 రకాల పండ్లతోటలు, 2 రకాల పూలతోటలు, మునగ సాగును జిల్లాలో విస్తృతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆసక్తి కలిగి ఉపాధిహామీ జాబ్ కార్డు ఉన్న రైతులు తమ దరఖాస్తులను సంబంధిత అధికారికి సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

============================

అండర్సన్-తెందుల్కర్ ట్రోఫీలో భాగాంగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ జట్టు భోజన విరామ సమయానికి 5 వికెట్ నష్టానికి 327 పరుగుల చేసింది. మూడవ రోజు అయిన ఈరోజు 3 వికెట్లకు 209 పరుగులతో ఇంగ్లాండ్ ఆట ప్రారంభించింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులు చేసింది.

============================

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజులు ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయల సీమ జిల్లాల్లో... తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ 19 సెకన్లు)

============================
============================